క్లుప్తంగా

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల అందజేత



క్రీడా యూనిఫాంతో విద్యార్థులు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా యూనిఫాం అందజేశారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా యూనిఫాంతో పాటు స్టీల్ వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కల్యాణ్ చక్రవర్తి రెడ్డి, నాగరాజు, డోనర్ మల్లికార్జున్ రెడ్డి, హెచ్‌ఎం సత్యం పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ శశిధర్, ఆలయ చైర్మన్ సుధాకర్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 193 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ. 10,25,254 వచ్చిందని ఆలయ ఈఓ శశిధర్, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం



రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఐనోల్, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, బచ్చుగూడెం, ఇంద్రేశం, రామేశ్వరం బండ గ్రామాలను నూతనంగా ఇంద్రేశం మున్సిపాలిటీ చేసి విలీనం చేశారు. దీంతో గురువారం ఐనోల్, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, బచ్చుగూడెం గ్రామాల రికార్డులను మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి స్వాధీనం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విలీనమైన గ్రామ పంచాయతీలలో పూర్తిస్థాయిలో మున్సిపల్ పరిపాలన ప్రారంభమవుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక వార్డ్ ఆఫీసర్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని తెలిపారు. ఇప్పటికే నాలుగు గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, రామేశ్వరం బండ, ఇంద్రేశం గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు.

కురుమలు ఐక్యంగా రాణించాలి



నూతన కమిటీతో మల్లేశం

సదాశివపేట(సంగారెడ్డి): కురుమలు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ గార్డెన్‌లో జరిగిన మండల కురుమ సంఘం నూతన అధ్యక్ష, కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కురుమలు సామాజిక, ఆర్థికంగా రాజకీయ రంగాల్లో ఎదగాలన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎటిగడ్డ సంఘం మాజీ సర్పంచ్ శివలింగ నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా కాశిపురం రవికుమార్, యువత అధ్యక్షుడిగా కొత్తగడి సురేష్, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బురుగడ్డ నాగేశ్, ఐసీ మోహన్, డాక్టర్ శ్రీహరి, పాండు, ప్రకాష్, రమేష్, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, రాందాస్, గోపాల్, సోము, శేఖర్, శివకుమార్, అశోక్, ప్రభు, సాయికుమార్, మాణిక్యం, బుచ్చయ్య, అక్షయ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నారాయణఖేడ్: నిజాంపేటకు చెందిన దుబాసి గంగమణికి గురువారం ఎల్‌ఓసీ మంజూరైంది. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సు మేరకు అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీని ఖేడ్‌లో యువజన కాంగ్రెస్ నాయకుడు సాగర్ షెట్కార్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శిథిలాల తొలగింపు షురూ

- శరవేగంగా సాగుతున్న పనులు
- కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థులు
- పరిశీలించిన అధికారులు



పాఠశాల శిథిలాలను తొలగిస్తున్న జేసీబీ

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల శిథిలాలను సంబంధిత అధికారులు, ఎంపీడీఓ హరినందన్‌రావు, బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ ఆధ్వర్యంలో శరవేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల, హాస్టల్ భవన శిథిలాలను జేసీబీలతో తొలగిస్తున్నారు. విద్యార్థులతోపాటు స్థానికుల సైతం ఇబ్బందులు లేకుండా శిథిలాలను జాగ్రత్తగా తొలగించాలని కోరారు. అయితే శిథిలాల కింద పడి తమ వస్తువులు పనికి రాకుండా పోవడంతో పలువురు విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫర్నీచర్ పనికి రాకుండా పోవడం, దుస్తులు, బుక్స్, ఇతర వస్తువులు పనికి రాకుండా పోవడంతో పలువురు విద్యార్థులు ఆవేదన చెందారు. అయితే తాత్కాలిక పనులు త్వరితగతిన నిర్వహించాలని ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఇందులో భాగంగానే ఎప్పటికప్పుడు పనుల నిర్వహణ వివరాలను మంత్రి తెలుసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు మక్సూద్ పటేల్ తెలిపారు. అంతే కాకుండా విద్యార్థుల ఫర్నీచర్‌ను ఒకే దగ్గర ఏర్పాటు చేసే పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో అవసరమయ్యే ఫర్నీచర్‌ను పక్కు తీస్తున్నారు. అలాగే శిథిలాల కింద పడి పనికి రాకుండా పోయిన వాటిని పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవానీ మాత దీక్షదారుల పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభిస్తున్న సంగ్రామ్ మహరాజ్, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా నుంచి భవానీ మాత దీక్షదారులు గురువారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ క్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్ ఆధ్వర్యంలో పాదయాత్రగా బయల్దేరారు. ఇందులో బల్కంచెల్క తండా, రాంచందర్ తండా, నాగధర్, మునిగేపల్లి, అలీఖాన్‌పల్లి తండాలకు చెందిన దీక్షదారులు ఉన్నారు. ఈ మేరకు కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, ఇరక్‌పల్లికు చెందిన దేవదాస్ మహరాజ్ ప్రత్యేకంగా పూజలు చేశారు. నాగధర్, కద్పల్, సిర్గాపూర్, వాసర్ మీదుగా మొదటి రోజు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో దీక్షదారులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రాములు, రూప్‌సింగ్, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బృందం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజులపాటు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించింది. ఇందులో జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, భవిష్యత్ ఆవిష్కరణల వైపు యువ మనస్సులను ప్రేరేపించడం లక్ష్యంగా.. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, ఐటీ టూల్స్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లోని ప్రాథమిక భావనలను పరిచయం చేశారు. అనంతరం ఉద్భవిస్తున్న సాంకేతికతపై ఆచరణాత్మక అవగాహన కల్పించారు. అలాగే హెచ్‌ఎం వసంత అభ్యర్థన మేరకు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్–కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి ఆమోదం, పర్యవేక్షణ నిర్వహించారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడొద్దని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జూహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో భారతి నగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మూడు డివిజన్‌లో పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రధానంగా సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, కమ్యూనిటీ హాల్స్, ప్రహరీ, శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు, సామాజిక ఫంక్షన్ హాళ్లు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అలాగే అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ.. పలు అభివృద్ధి పనుల్లో వేగం మందగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్లు సమన్వయం చేసుకుంటేనే సత్ఫలితాలు సాధిస్తామని సూచించారు. నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు అందిస్తే ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, ఏఈలు శివకుమార్, ఫైజన్, దివ్య తేజ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని రుక్మాపూర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాల్వలు, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

గురుకుల పాఠశాల పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాలను ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్ ప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అధ్యక్షుడు మైసగళ బుచ్చేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల శిథిలాలను పరిశీలించి ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడడం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ గాంధీనగర్‌లోని డంపు యార్డ్‌ను మరోచోటుకు తరలించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. డంపుయార్డ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీ మధ్య నుంచి మరో చోటుకు తరలించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ రత్నం, కాలనీవాసులు , తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

కార్పొరేటర్ సింధు రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న సింధు రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ సింధు రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆమె నివాసంలో డివిజన్ పరిధిలోని సమస్యలపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో ప్రజల కోరిక మేరకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని వివరించారు. మొదటి ప్రాధాన్యతగా రోడ్ల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కోరారు. అలాగే ఎల్‌ఐజీ, ఎంఐజీ కాలనీలలో సీసీ రోడ్డులు, మ్యాక్ సొసైటీ కాలనీలో పనులకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ఈఈ సురేష్, డీఈ దేవేందర్, ఏఈ ఫైజాన్ పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్: రెవెన్యూ డివిజన్‌గా ఉన్న జహీరాబాద్‌లో డీఎల్‌పీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం ఉన్నతాధికారులను కోరారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, పలు సంఘాలు అఖిల పక్షంగా ఏర్పడి ఆందోళనలు చేయడం మూలంగానే సాధించుకున్నామన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా కేవలం ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. అలాగే మరిన్ని డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సంగారెడ్డిలోనే కొనసాగుతున్నాయని, డీఎల్‌పీఓ కార్యాలయాన్ని జహీరాబాద్‌లో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయం ఏర్పాటు చేసి పరిపాలన ప్రజలకు మరింత చేరువలోకి తీసుకురావాలని కోరారు. సామాజిక కార్యకర్తలు శికారి గోపాల్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు



చెన్నారెడ్డి నగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

జహీరాబాద్: పట్టణంలోని చెన్నారెడ్డి నగర్ కాలనీలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. చెన్నారెడ్డి నగర్ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు జరగలేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతుండడంతో కాలనీ ప్రజలు నరకయాతన పడ్డారు. అయితే ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై మున్సిపల్ అధికారులకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మరమ్మతులకు నోచుకోని రహదారి



దెబ్బతిన్న సీసీ రోడ్డు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారులు, పాలకులు మారుతున్నా గ్రామీణ రహదారుల రూపురేఖలు మారడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టించుకోకపోవడంతో రహదారులపై రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిధిలోని పొట్టిపల్లి నుంచి జహీరాబాద్ మండలంలోని అల్గోల్‌కి సుమారు 3 కిలోమీటర్ల మేర సీసీ రహదారి 2007లో నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా పగుళ్లు, గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. వర్షాకాలంలో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ మనయ్య

రాయికోడ్(అందోల్): మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. ఈ మేరకు మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఎంఈఓ మనయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యయులను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ రమేష్‌బాబు హాజరయ్యారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదని తెలిపారు. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఎంఈఓ గంజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు జాబ్ మేళా**

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాసిస్ట్, ఫీల్డ్ క్రెడిట్ ఆఫీసర్‌లో 120 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **ముదిరాజ్ నాయకుల సన్మానం**

జహీరాబాద్ టౌన్: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రదీప్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం సన్మానించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన ముదిరాజ్ సమావేశంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీశైలం, బరూర్ దత్తాత్రి, నర్సింలు, రఘురాం, రాజనర్సింహ, మల్లికార్జున్, సతీష్, రవీందర్, గోపాల్ పాల్గొన్నారు.

◆ **నీటి శుద్ధి కర్మాగారానికి మరమ్మతులు**

మునిపల్లి(అందోల్): మండలంలోని బుస్సారెడ్డిపల్లి శివారులోని సింగూర్ ఆనకట్ట వద్ద ఉన్న 100 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కర్మాగారానికి మరమ్మతులు చేస్తున్నట్లు ఉప తహసీల్దార్ ప్రదీప్ గురువారం తెలిపారు. ఈనెల 12న 8 మండలాల్లోని 241 గ్రామాలకు, 8 మున్సిపాలిటీలకు తాత్కాలికంగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభావిత మండలాలు సదాశివపేట, కొండాపూర్, కంది, పటాచేరు, మొగుడంపల్లి, కోహీర్, మునిపల్లికి నీటి సరఫరా బంద్ చేయిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 8 మున్సిపాలిటీలు జహీరాబాద్, కోహీర్, సదాశివపేట, సంగారెడ్డి, ఇస్మాపూర్, తెల్లాపూర్, ఇంద్రేశం, అమీన్‌పూర్‌లకు నీటి సరఫరా ఉండదన్నారు. కావున సంబంధిత ఆయా మండలాలు, మున్సిపాలిటీలోని ప్రజలు అవసరమైన నీటి నిల్వలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని మిషన్ భగీరథ అధికారులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

◆ **దోపిడీని నియంత్రించాలి**

నారాయణఖేడ్: విద్య, వైద్య దోపిడీని చట్టాల ద్వారానే నియంత్రించాలని ఏఐఎస్‌ఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీ అన్నారు. ఈ మేరకు గురువారం కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖేడ్‌లో ఏఐఎఫ్‌డీవై, ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో 'విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి' అనే అంశంపై ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నాయన్నారు. ఉచిత విద్య, వైద్యం కోసం విద్యార్థులు, యువత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తెంకటికుమార్, ఇతర బాధ్యులు శ్రీకాంత్, అరుణ్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **కారు అద్దాలు పగలగొట్టి నగదు చోరీ**

సంగారెడ్డి క్రైమ్: కారు అద్దాలు పగలగొట్టి నగదు చోరీ చేసిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన నరసింహారెడ్డి కొంతకాలంగా బైపాస్‌లోని అయ్యప్ప నగర్ కాలనీలో కిరాణా షాప్ నడుపుతున్నాడు. ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటల సమయంలో బ్యాంకు నుంచి రూ.8 లక్షలు తీసుకొని తన కారులో నుంచి షాప్ వద్దకు తిరిగి వచ్చాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ **పీడీఎస్ బియ్యం పట్టివేత**

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని 161 జాతీయ రహదారిపై గురువారం పీడీఎస్ రేషన్ బియ్యం పట్టుకున్నారు. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. 161 జాతీయ రహదారిపై పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో జోగి పేట నుంచి సంగారెడ్డికి వెళ్తున్న లారీని నిలిపి తనిఖీలు నిర్వహించగా.. అక్రమంగా తరలిస్తున్న 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ **గంజాయి కేసు.. నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష**

సంగారెడ్డి టౌన్: గంజాయి కేసులో నిందితుడికి గురువారం సంగారెడ్డి జిల్లా కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఎక్సైజ్ సీఐ నజీర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని పెద్ద చల్మెడకి చెందిన మల్లేశం 2021లో 2కేజీల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ కేసుపై అదనపు జిల్లా స్టేషన్స్ జడ్జి గురువారం తీర్పు ఇచ్చారు. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ చేసిన కేసులో సంగారెడ్డి చార్జ్ షీట్ దాఖలు చేసిందని తెలిపారు.

◆ **ఖేడ్‌లో భారీ వర్షం**

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని మురుగు కాల్వలు పొంగిపొర్లడంతో వరదనీరు జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారిపై నుంచి పారింది. దీంతో గంటపాటు జనజీవనం స్తంభించింది. ఈ వర్షానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. వివిధ పంటలు కోతల సమయం కావడంతో కోతకోసం సూర్పిళ్లకు ఉంచిన పప్పుధాన్యాలు తడిసి పాడయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

◆ **గోమారంలో ప్రభుత్వ భూమి సర్వే**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారంలో విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది గురువారం జాయింట్ సర్వే చేశారు. గ్రామ నడిబొడ్డున సర్వే నంబరు 539లోని 10 గుంటల ప్రభుత్వ భూమి, సర్వే నంబరు 538లోని పిత్తర్‌కుంటకు సంబంధించి 3 ఎకరాల శిఖం భూమి రికార్డు పరంగా ఉంది. పలువురు బడాభూస్వాములు కబ్జా చేసి సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మాణాలు, కట్టడాలు చేశారని గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అందుకుగాను ఇరిగేషన్ డీఈ బుచ్చిబాబు, ఆర్‌ఐ కిషన్, సర్వేయర్ అరుణ్‌కుమార్ కుంట శిఖం, ప్రభుత్వ భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గుర్తించినట్లు అధికారులు చెప్పారు.

◆ **15న క్రీడా పాఠశాలకు ఎంపిక**

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 15న చేగుంటలోని గిరిజన బాలికల గురుకుల క్రీడా పాఠశాలకు విద్యార్థినులను ఎంపిక చేయనున్నట్లు ఆర్‌సీఓ గంగా రాంనాయక్, స్థానిక గిరిజన బాలికల మినీగురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 9వ తరగతి చదివే గిరిజన బాలికలు బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రంతో క్రీడాపోటీలకు హాజరు కావాలని చెప్పారు. ప్రతిభ, ఖాళీల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.